ఈనాడు
పెద్దపల్లి
శనివారం సెప్టెంబరు 28, 2024

అనుమతి లేని నిర్మాణాలపై దృష్టి పెట్టండి


నిలిచిన పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లి, న్యూస్‌టుడే: తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీయూఎఫ్ఐడీసీ) నిధులతో పెద్దపల్లి పురపాలక సంఘం పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీహర్ష ఆదేశించారు. పట్టణంలో అభివృద్ధి నిధుల వినియోగంపై శుక్రవారం ఆయన పురపాలిక అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ ఆవరణలో నిర్మిస్తున్న సమీకృత విపణి సముదాయం, డంపింగ్‌యార్డు, ఎస్సీ బాలికల వసతిగృహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణంలో అనుమతి లేకుండా జరుగుతున్న నిర్మాణాలపై దృష్టి సారించాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పన్నుల వసూళ్లతో పాటు ఆదాయం పెంచే మార్గాలను అన్వేషించాలని సూచించారు. పట్టణంలోని వ్యాపారులందరికీ ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి చేయాలన్నారు. నిలిచిన సమీకృత విపణి నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్, ఏఈ సతీశ్ సిబ్బంది పాల్గొన్నారు.

అడ్డుకట్ట వేసి.. ఆపదలోకి నెట్టేసి!



ఇది ప్రధాన కూడలి నుంచి బల్దియా కార్యాలయానికి వెళ్లే మార్గంలో ఇందిరాగాంధీ కూడలిలో గొయ్యి ప్రమాదకరంగా ఉంది. పైపులైన్ లీకేజీ అరికట్టడానికి రోడ్డును తవ్వి మరమ్మతులు చేసిన అధికారులు పూర్తి స్థాయిలో పూడ్చకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. **- న్యూస్‌టుడే, గోదావరిఖని పట్టణం**

అల్పాహారం.. మహోపకారం



దాతలు స్పందిస్తే విద్యార్థులకు మేలు

ఈనాడు, పెద్దపల్లి, న్యూస్‌టుడే, పాలకుర్తి

ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువగా పేద విద్యార్థులు చదువుతుంటారు. పేదరికం.. ఇంట్లో తల్లిదండ్రులు ఉదయమే కూలీ పనులకు వెళ్లడం తదితర కారణాలతో ఏమీ తినకుండానే పాఠశాలలకు వెళ్తున్నారు. అసలే పోషకాహార లోపంతో బాధ పడుతున్న వారు సరైన సమయానికి అల్పాహారం అందక నీరసపడిపోతున్నారు. తరగతి గదుల్లో బద్ధకంగా ఉండటం, పాఠాలు సరిగా అర్థం చేసుకోలేకపోవడం వంటి సమస్యలతో సతమతమవుతున్నారు. గత ప్రభుత్వం గతేడాది అక్టోబరు 6న ముఖ్యమంత్రి అల్పాహార పథకాన్ని ప్రవేశపెట్టి ప్రయోగాత్మకంగా విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న బడుల్లో అమలు చేసింది. ఈ ఏడాది జనవరి వరకు అల్పాహారం, ఆగస్టు వరకు రాగిజావ అందించారు. త్వరలోనే కొన్ని మార్పులు చేసి అల్పాహార పథకం పునః ప్రారంభించే అవకాశాలున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఆలోపు దాతలు స్పందిస్తే చిన్నారులకు ఇబ్బందులు తప్పించినవారవుతారు.

నియోజకవర్గంలో 200 మంది విద్యార్థులకు పైబడి ఉన్న పాఠశాలలకు ఉదయం అల్పాహారం అందిస్తా. పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం చిరుతిళ్లు అందజేస్తా.
- బుధవారం గర్షకుర్తి జడ్పీ ఉన్నత పాఠశాలలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

ఉమ్మడి జిల్లా వివరాలు

ప్రభుత్వ పాఠశాలలు	విద్యార్థులు :
3,312	3,78,005 మంది

అందరూ కలిసి అండగా నిలిస్తే!

సత్యసాయి అన్నపూర్ణ ట్రస్టు ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో దాదాపు అయిదేళ్లపాటు ఉదయం రాగిజావ పంపిణీ చేశారు. దీంతో ఇంటి వద్ద ఉదయం తినిరాని విద్యార్థులకు కొంత ఉపయోగపడేది. ఈ విద్యా సంవత్సరం ఆగస్టు వరకు రాగిజావ పంపిణీ చేసి ఆపేశారు. అధికారులు సంప్రదిస్తే ప్రభుత్వంతో ఒప్పంద గడువు ముగియడంతో నిలిపివేసినట్లు చెబుతున్నారు. దీంతో చాలా మంది విద్యార్థులు ఖాళీ కడుపులతో మధ్యాహ్నం వరకు పాఠాలు వినాల్సి వస్తుంది. 100 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో రోజు రాగి జావ పంపిణీ చేయాలంటే దాదాపు రూ.300 వరకు ఖర్చు అవుతుంది. నెలకు రూ.9 వేలు, 10 నెలలకు రూ.90 వేలతో 100 మంది విద్యార్థులకు విద్యా సంవత్సరమంతా రోజూ జావ పంపిణీ చేయొచ్చు. ఒక పాఠశాలలో 500 మంది విద్యార్థులు ఉన్నా సంవత్సరానికి ఈ ఖర్చు రూ.4.5 లక్షలు దాటదు. ప్రభుత్వం స్పందించి అల్పాహారం ఏర్పాటు చేసే వరకు ఆగకుండా ఏ గ్రామానికి ఆ గ్రామంలో నాయకులు, దాతలు స్పందిస్తే చిన్నారులకు ఆకలి బాధలు తప్పుతాయి. బాగా చదువుకోగలుగుతారు.


సుల్తానాబాద్ : దేవునిపల్లి పాఠశాలలో గతేడాది రాగి జావ పంపిణీ

ఉదయం 8 గంటలకే పాఠశాలకు..



బోడగుట్టపల్లి నుంచి కిలోమీటరు దూరంలోని కన్నాల గ్రామ పాఠశాలకు నడుచుకుంటూ ఉదయం 8 గంటల వరకే చేరుకుంటా. అమ్మానాన్నలు ఉదయమే పనులకు వెళ్తారు. గతంలో రాగిజావ ఇచ్చేవారు. గత సంవత్సరం కొన్ని నెలలు అల్పాహారం పంపిణీ చేశారు. దీంతో ఆకలి బాధ ఉండేది కాదు. ప్రస్తుతం వాటి పంపిణీ లేక ఇంటి వద్ద తిని రాని రోజు ఆకలి బాధతో పాఠాలు వినాల్సి వస్తోంది.

- రామ్‌చరణ్, 8వ తరగతి, బోడగుట్టపల్లి , పాలకుర్తి మండలం

నేరుగా మధ్యాహ్న భోజనం తింటున్నా



ప్రతి రోజూ వడ్డెర కాలనీ నుంచి ఆర్టీసీ బస్సులో 10 కిలోమీటర్ల దూరంలో ఉండే ఒద్యారం జడ్పీహెచ్‌ఎస్‌కు వస్తుంటా. ఉదయం 8 గంటలకే బయల్దేరి వస్తా. రాగిజావ, అల్పాహారం పంపిణీ నిలిచిపోవడంతో మధ్యాహ్న భోజనం వరకు ఆకలితో ఉండాల్సిందే. ఉపాధ్యాయులను అడిగితే ప్రభుత్వం నుంచి సరఫరా లేదని చెబుతున్నారు.

- తోక సాయికుమార్, ఒద్యారం, గంగాధర మండలం, కరీంనగర్

కొండా లక్ష్మణ్ సేవలు మరువలేం


లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న సీపీ శ్రీనివాస్

గోదావరిఖని, న్యూస్‌టుడే: రామగుండం పోలీసు కమిషనరేట్‌లో శుక్రవారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. స్వాతంత్ర్య, తెలంగాణ ఉద్యమాల్లో, నిరంకుశ నిజాం పాలనకు వ్యతిరేకంగా చేసిన పోరాటంలో ఆయన సేవలు మరువలేమని ఈ సందర్భంగా సీపీ పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉమ్మడి రాష్ట్రానికి సేవలందించారని వెల్లడించారు. ఏసీపీ రాఘవేంద్రరావు, సీఐలు రవీందర్, అజయ్‌బాబు, దామోదర్, మల్లేశం, శ్రీనివాస్, వామనమూర్తి, సంపత్, కార్యాలయం సూపరింటెండెంట్ ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.

రైతులను నిలువు దోపిడీ చేసిన భారాస


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

జూలపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో గత భారాస ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులను నిలువు దోపిడీ చేసిందని ఎమ్మెల్యే విజయరమణారావు పేర్కొన్నారు. శుక్రవారం జూలపల్లిలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఛైర్మన్ కొంజర్ల వెంకటయ్య అధ్యక్షతన నిర్వహించిన 128వ సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు గ్యారంటీలను అమలు చేయడంతో పాటు ప్రతి రైతుకు రూ.2 లక్షల రుణాల మాఫీ చేశామన్నారు. ఈ వానాకాలంలో పండిన సన్న ధాన్యానికి రూ.500 చొప్పున బోనస్ ఇస్తామని తెలిపారు. సమావేశంలో ధూళికట్ట సహకార సంఘం ఛైర్మన్ వేణుగోపాల్‌రావు, వైస్ ఛైర్మన్ ముత్తులింగం, సీఈవో సుధాకర్, ఏవో ప్రత్యూష, సంఘం డైరెక్టర్లు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

చెత్త శుద్ధిపై నిర్లక్ష్యం వద్దు


బయోమైనింగ్ యూనిట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

ఈనాడు స్పందనకు వందనం

ఈనాడు, పెద్దపల్లి: చెత్త శుద్ధీకరణతో సేంద్రియ ఎరువు తయారీ ప్రక్రియపై అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని కలెక్టర్ శ్రీహర్ష పెద్దపల్లి పురపాలక కమిషనర్ వెంకటేశ్‌ను ఆదేశించారు. రాఘవాపూర్-గౌరెడ్డిపేట గ్రామాల సరిహద్దున ఏర్పాటు చేసిన బయోమైనింగ్ యూనిట్ నిర్వహణలో పురపాలిక అధికారులతో పాటు గుత్తేదారుల నిర్లక్ష్యంపై ‘చెత్త శుద్ధీకరణ ఎక్కడ?’ శీర్షికన ఈ నెల 20న ‘ఈనాడు’లో కథనం ప్రచురితమైంది. స్పందించిన కలెక్టర్ శుక్రవారం అధికారులతో సమీక్షించారు. గౌరెడ్డిపేటలో రూ.3 కోట్లతో ఏర్పాటు చేసిన బయోమైనింగ్ యూనిట్‌ను సందర్శించారు. వానాకాలంలోనూ చెత్త శుద్ధి జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గుత్తేదారును పిలిపించి సేంద్రియ ఎరువు తయారీని ప్రయోగాత్మకంగా తయారీ చేపట్టిన తర్వాత, పూర్తిస్థాయి శుద్ధీకరణ ప్రక్రియ ప్రారంభించాలని కమిషనర్‌ను ఆదేశించారు.

అలరించిన కళోత్సవాలు


విజేతలతో అధికారులు

పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: పెద్దపల్లి ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి కళోత్సవాల్లో విద్యార్థులు ప్రతిభ చాటారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 9వ తరగతి విద్యార్థులు పోటీల్లో కళా నైపుణ్యం కనబరిచారు. పెద్దపల్లి బాలికల పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. సమగ్ర శిక్షా జిల్లా సమన్వయకర్త పీఎం షేక్, ఎంఈవో సురేందర్‌కుమార్, నరేష్, వెంకటేశ్, సుధాకర్ పాల్గొన్నారు.

విశ్రాంత కార్మికుల వేతన వేదన

నెలలు గడుస్తున్నా అందని బకాయిలు



న్యూస్‌టుడే, గోదావరిఖని

సింగరేణిలో పదకొండో వేతన ఒప్పందం జరిగి 16 నెలలు గడిచిపోయింది. కార్మికులు 2023, జూన్ నుంచి కొత్త వేతనాలు పొందుతున్నారు. కానీ ఉద్యోగ విరమణ పొందిన కార్మికులకు మాత్రం ఇప్పటివరకు నూతనంగా సవరించిన బకాయిలు చెల్లించలేదు. బొగ్గుగని కార్మికులకు 11వ వేతన ఒప్పందం 2021, జులై 1 నుంచి అమలుకాగా.. 2026, జూన్ 30 వరకు ఒప్పందం కుదిరింది. 2021, జులై 1 నుంచి.. 2023, ఏప్రిల్ వరకు పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన కార్మికులకు కొత్త వేతనాలు అమలు చేయాల్సి ఉంది. 20 నెలలు ఆలస్యంగా ఒప్పందం కుదరడంతో ఆ సమయంలో పనిచేసిన ఉద్యోగులకు.. పెరిగిన జీతభత్యాలకు సంబంధించిన బకాయిలను చెల్లించాల్సి ఉంటుంది.

3 వేల మంది నిరీక్షణ..

పదకొండో వేతన కాలపరిమితిలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన దాదాపు మూడు వేల మంది విశ్రాంత కార్మికులకు పెరిగిన జీతభత్యాలు అమలు కావాల్సి ఉంది. ఒక్కో విశ్రాంత కార్మికునికి రూ.30 వేల నుంచి రూ.2.5 లక్షల వరకు బకాయిలు రావాల్సి ఉంది. 20 నెలల కాలంలో పనిచేసిన కార్మికులకు.. వారి వారి సర్వీసు ఆధారంగా వేతనాలు లెక్కించి చెల్లిస్తారు. పలు గ్రేడ్‌లలో, సూపర్‌వైజర్ కేడర్‌లో పనిచేసిన విశ్రాంత ఉద్యోగులకు ఎక్కువ మొత్తంలో బకాయిలు చెల్లించాలి. సాధారణ జనరల్ మజ్దూర్ హోదాలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందినవారికి రూ.50 వేల నుంచి రూ.75 వేల వరకు వచ్చే అవకాశం ఉంది. వీటికోసం వారు ఎదురుచూస్తున్నారు.

బొగ్గుగని కార్మికుల వేతన కాలపరిమితి, ఒప్పందాలు

వేతన సవరణ	కాలపరిమితి	ఒప్పందం
ఎన్‌సీడబ్ల్యుఏ-5	1-07-1991 - 30-06-1996	19-01-1996
ఎన్‌సీడబ్ల్యుఏ-6	1-07-1996 - 30-06-2001	23-12-2000
ఎన్‌సీడబ్ల్యుఏ-7	1-07-2001 - 30-06-2006	15-07-2005
ఎన్‌సీడబ్ల్యుఏ-8	1-07-2006 - 30-06-2011	24-01-2009
ఎన్‌సీడబ్ల్యుఏ-9	1-07-2011 - 30-06-2016	31-01-2012
ఎన్‌సీడబ్ల్యుఏ-10	1-07-2016 - 30-06-2021	10-10-2017
ఎన్‌సీడబ్ల్యుఏ-11	1-07-2021 - 30-06-2026	20-05-2023

స్పందించని సంఘాలు..

విశ్రాంత కార్మికుల వేతన బకాయిల చెల్లింపుపై కార్మిక సంఘాలు స్పందించడం లేదు. బకాయిలు పంపిణీ చేయాలన్న విషయాన్ని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లకపోవడంతో జాప్యం జరుగుతుంది. బొగ్గుగని కార్మికులకు మొదటి మూడు వేతన సవరణలు నాలుగేళ్ల కాలపరిమితి ఉండగా.. నాలుగో వేతన సవరణ కాలపరిమితి నాలుగున్నరేళ్లుగా నిర్ణయించారు. ఐదో వేతన సవరణ నుంచి ఐదేళ్ల కాలపరిమితితో వేతన ఒప్పందాలను అమలు చేస్తున్నారు.


కోడి పిల్లలను పంపిణీ చేస్తున్న విస్తృత సంచాలకురాలు విజయ, ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాస్

పెరటి కోళ్ల పెంపకంతో ఆదాయం

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: పెరటి కోళ్ల పెంపకంతో అదనపు ఆదాయం పొందవచ్చని కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయం విస్తృత సంచాలకురాలు డా. డీఈ విజయ, కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాస్ అన్నారు. రామగిరి మండలం రత్నాపూర్ కేవీకే పరిధిలో షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళిక కింద రత్నాపూర్, కమాన్‌పూర్ మండలం రొంపికుంట గ్రామాల ఎస్సీ రైతులకు ఒక్కో యూనిట్ చొప్పున 10 అసిల్ కోడి పిల్లలను శుక్రవారం వారు పంపిణీ చేశారు. రత్నాపూర్‌కు 1100, రొంపికుంట రైతులకు 400 కోడి పిల్లలను పంపిణీ చేశామన్నారు. కేవీకే పశు విభాగం శాస్త్రవేత్త డాక్టర్ అర్చన, కేవీకే శాస్త్రవేత్తలు వెంకన్న, భాస్కరరావు, కిరణ్, నరేశ్, ఆశశ్రీ, స్రవంతి, ఏడీఏ అంజలి, ఏవో శ్రీకాంత్, నాయకులు పాల్గొన్నారు.

ఇటుక బట్టీలపై హైడ్రా పోటు

- రాజధానిలో మందగించిన నిర్మాణ రంగం
- జిల్లాలో పడిపోయిన విక్రయాలు

‘మూలిగే నక్కపై తాటిపండు పడిన’ చందాన మారింది జిల్లాలోని ఇటుక తయారీదారుల పరిస్థితి. అసలే స్థిరాస్తి వ్యాపారం మందగించి విక్రయాలు పడిపోగా రాజధానిలో హైడ్రా(హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) దెబ్బకు నిర్మాణాలు నిలిచిపోవడం అశనిపాతంలా మారింది. గిరాకీ లేక ఇటుక పేరుకుపోతుండటంతో తయారీదారులు కొత్త మార్కెట్ అన్వేషణలో పడ్డారు.

న్యూస్‌టుడే, పెద్దపల్లి

జిల్లాలోని పెద్దపల్లి, సుల్తానాబాద్, రామగుండం, కమాన్‌పూర్ ప్రాంతాల్లో దాదాపు 80 ఇటుక తయారీ పరిశ్రమలున్నాయి. ఒక్కో పరిశ్రమలో ఏటా 50 లక్షల నుంచి 2 కోట్ల వరకు ఇటుకలు ఉత్పత్తి అవుతుండగా 70 శాతం హైదరాబాద్ నగరం, పరిసర ప్రాంతాలకే తరలుతున్నాయి. ఇక్కడి నుంచి ప్రతి రోజూ 80 లారీల(దాదాపు 10 లక్షల) ఇటుక అక్కడికి సరఫరా అవుతున్నాయి. వర్షాకాలంలో దాదాపు 40 లారీల ఇటుక వెళ్తోంది. నెల రోజులుగా నిత్యం మూడు లారీలకు పడిపోయింది. రాజధాని ప్రాంతంలో కూల్చివేతలతో బిల్డర్ల వేచి చూసే ధోరణితో నిర్మాణాలు నిలిచిపోయాయి. ఫలితంగా జిల్లా ఇటుకకు గణనీయంగా తగ్గింది. నెల రోజులుగా రోజుకు రెండు, మూడు లారీల కంటే ఎక్కువ వెళ్లడం లేదు.



ఏటా రూ.100 కోట్ల వ్యాపారం

ఒక ఇటుక ధర సీజన్‌లో రూ.10 ఉండగా ప్రస్తుతం రూ.8కి పడిపోయింది. ఇక్కడి నుంచి హైదరాబాద్ రవాణా చేయడానికి ఒక్కో దానిపై రూ.2.5 చొప్పున వ్యయం అవుతోంది. ఉత్పత్తిలో 70 శాతం రాజధానికే తరలుతుండటంతో ఇక్కడి పరిశ్రమల వ్యాపారం రూ.100 కోట్లు దాటింది.


ఇక్కడి నుంచే ఎందుకు?

జిల్లాలో నాణ్యమైన మట్టి, ఎన్టీపీసీ పరిశ్రమ నుంచి వెలువడే బూడిదతో తయారు చేసిన ఇటుక దృఢంగా, తేలికగా ఉండటంతో హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో గిరాకీ ఎక్కువగా ఉంటుంది.

మిగిలింది రెండు నెలలే!

- హైడ్రా కూల్చివేతలతో నిర్మాణ రంగం కుదేలైంది. కొత్త నిర్మాణాలు చేపట్టేందుకు బిల్డర్లు వెనుకడుగేస్తున్నారు.
- హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఇటుక తయారీ పరిశ్రమ విస్తరించడం, ఇక్కడి నుంచి రవాణా వ్యయం పెరగడం కూడా వ్యాపారంపై ప్రభావం చూపుతోంది.
- రవాణా వ్యయాన్ని తగ్గించేందుకు గతంలో లారీల సామర్థ్యానికి మించి తరలించేవారు. కొంతకాలంగా రాత్రి వేళల్లో రవాణా శాఖ అధికారుల తనిఖీలు, జరిమానాలు పెరగడంతో అది సాధ్యం కావడం లేదు.
- ఉమ్మడి జిల్లాలోనూ స్థిరాస్తి వ్యాపారం నిలిచిపోవడంతో నిర్మాణ రంగం మందగించింది.
- గత జనవరి నుంచి మే చివరి వరకు(తయారీ సీజన్) ఉత్పత్తి చేసిన ఇటుకలో ఇప్పటివరకు సగం కూడా విక్రయించలేదు. మరో రెండు నెలల్లో విక్రయ సీజన్ ముగిసిపోతుండటం నిర్వాహకులను బెంబేలెత్తిస్తోంది.

బ్యాంకు రుణాలు చెల్లించలేని పరిస్థితి



నిర్మాణాలు పూర్తయిన భవనాలు అమ్ముడుపోతేనే బిల్డర్లు కొత్త పనులు ప్రారంభిస్తారు. స్థిరాస్తి వ్యాపారంలోని ఒడుదొడుకులు, హైడ్రా ప్రభావంతో నగరంలో విక్రయాలు మందగించడంతో కట్టడాలు నిలిపివేశారు. నిర్మాణాలు, విక్రయాల రొటేషన్ నిలిచి ఇటుకకు గిరాకీ తగ్గింది. ప్రస్తుత సీజన్ ముగిసే నాటికి పరిస్థితి మారకపోతే బ్యాంకు రుణాలు కూడా చెల్లించడం కష్టమే. **-సిద్దయ్య, ఇటుక పరిశ్రమ నిర్వాహకుడు**

మూడు చెరువులకు రూ.33 కోట్లు

మంథనిలో ఆధునికీకరణ పనులకు ప్రతిపాదనలు


మంథని రావుల చెరువు

న్యూస్‌టుడే, మంథని: మంథని పట్టణ సుందరీకరణలో భాగంగా రూ.33 కోట్ల వ్యయంతో మూడు చెరువుల ఆధునికీకరణకు నిధుల మంజూరుపై అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు నీటి పారుదల శాఖ అధికారులు స్థానిక రావులచెరువు, తమ్మిచెరువు, అయ్యగారి చెరువుల ఆధునికీకరణకు ప్రణాళికలు రూపొందించారు. ఈ మూడు తటాకాలను సిద్దిపేటలోని కోమటి చెరువు మాదిరిగా పర్యాటకులను ఆకట్టుకునేలా సుందరంగా తీర్చిదిద్దాలని భావిస్తున్నారు. కట్ట అభివృద్ధి, లేక్ ఫ్రంట్, చెరువు పూడికతీత, కట్టడాలు, లైటింగ్, టైల్స్ తదితర పనులు చేయడానికి రూ.33 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు నీటి పారుదలశాఖ ఈఈ బలరామయ్య తెలిపారు. పట్టణ సుందరీకరణలో భాగంగా గతంలో బొక్కలవాగు ఆనకట్టను మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దడానికి రూ.6 కోట్ల వ్యయంతో కిలోమీటరు దూరం సీసీ రోడ్డు, ఇరువైపులా మొక్కల పెంపకం, లైటింగ్, పార్కులు, జిమ్ ఏర్పాటు చేశారు. రూ.2.5 కోట్ల వ్యయంతో తమ్మిచెరువును ఆధునికీకరించారు. మూడు చెరువుల ఆధునికీకరణతో పట్టణ ప్రజలకు ఆహ్లాదం అందుబాటులోకి రావడంతో పాటు పర్యాటక అభివృద్ధి జరుగుతుంది.

చిల్లపల్లిలో పంచాయతీరాజ్ అధికారి పర్యటన


పంచాయతీ వద్ద గ్రామస్థులతో సంయుక్త కమిషనర్ శ్రీనివాస్, అధికారులు

మంథని గ్రామీణం, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పంచాయతీరాజ్ సంయుక్త కమిషనర్ ఎ. శ్రీనివాస్ శుక్రవారం మంథని మండలం చిల్లపల్లి పంచాయతీని సందర్శించారు. అనంతరం అధికారులు, మహిళా సంఘాలతో సమావేశమై పలు సూచనలు చేశారు. కేంద్ర ప్రభుత్వం అందించే మహిళా స్నేహపూర్వక పంచాయతీ అవార్డుకు జిల్లా నుంచి పలు గ్రామాలను ఎంపిక చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపామన్నారు. అందులో భాగంగా చిల్లపల్లిని ఎంపిక చేశామన్నారు. డీపీవో వీరబుచ్చయ్య, డీఎల్‌పీవో సతీశ్, ఎంపీడీవో పూర్ణచందర్, ఎంపీవో శేషయ్యసూరి, ప్రత్యేక అధికారి రవి, కార్యదర్శి రాం కిషోర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

డీఎస్సీ 2008 బాధితుల జాబితా విడుదల

న్యూస్‌టుడే, కరీంనగర్‌ విద్యావిభాగం

ఉమ్మడి జిల్లాలోని డీఎస్సీ- 2008 బాధిత అభ్యర్థుల జాబితాను ఎట్టకేలకు జిల్లా విద్యాశాఖ విడుదల చేసింది. డీఎస్సీ అర్హత సాధించి ఉద్యోగాలకు దూరమైన వారికి ప్రభుత్వం ఒప్పంద పద్ధతిన ఎస్జీటీ ఉద్యోగాలను కల్పించేందుకు ముందుకు వచ్చింది. సంబంధించిన అభ్యర్థుల జాబితాను ప్రకటించాలని రాష్ట్ర విద్యాశాఖ సూచించింది. దీంతో జిల్లా విద్యాశాఖ ఉమ్మడి జిల్లాలో 61 మంది బాధిత అభ్యర్థులున్నట్లు రెండు రోజుల క్రితం ప్రకటించింది. అందులో ఉద్యోగులు వారుండటం, నష్టపోయిన అభ్యర్థుల పేర్లు లేకపోవడంతో బాధిత అభ్యర్థులు ఆందోళన చెందారు.

186 మందితో

అభ్యర్థుల ఆందోళనపై 'అసలే ఆలస్యం.. ఆపై ఆవేదన' శీర్షిక శుక్రవారం 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన విద్యాశాఖ 61 మంది జాబితాను వెబ్‌సైట్‌ నుంచి తొలగించారు. వాస్తవంగా ఉద్యోగాలకు అర్హత సాధించిన వారికి దూరమైన 186 మంది అభ్యర్థులతో కొత్తగా జాబితాను జిల్లా విద్యాశాఖ రూపొందించి రాష్ట్ర విద్యాశాఖకు పంపించారు. మధ్యాహ్నం రాష్ట్ర విద్యాశాఖ వెబ్‌సైట్‌లో దాన్ని పొందుపర్చడంతో బాధిత అభ్యర్థులు ఊపిరిపీల్చుకున్నారు. అయితే 186 మంది కాకుండా మొత్తం 228 మంది ఉన్నట్లు అభ్యర్థులు పేర్కొంటున్నారు. డీఎస్సీ ఫలితాల మెరిట్‌ జాబితాలో ఉన్న పలువురు అభ్యర్థులు కొత్తగా ప్రకటించిన జాబితాను చూసి ఆందోళనకు గురవుతున్నారు. ఉద్యోగార్హత సాధించి నష్టపోయిన తమ పేర్లు జిల్లా విద్యాశాఖ ప్రకటించిన రెండో జాబితాలోనూ లేవని అభ్యర్థులు వై. వేణుగోపాల్‌, ఎస్‌. రాజిరెడ్డిలు పేర్కొన్నారు. దీనిపై పరిశీలన చేసి తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

ధ్రువపత్రాల పరిశీలన

బాధిత అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన శుక్రవారం ప్రారంభమైంది. వచ్చే నెల 4వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో నిర్వహిస్తామని డీఈవో పేర్కొన్నారు. అభ్యర్థుల జాబితాను రాష్ట్ర విద్యాశాఖ వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు చెప్పారు. అభ్యర్థులు ఒరిజినల్‌ సర్టిఫికెట్లతోపాటు గెజిటెడ్‌ అధికారితో ధ్రువీకరించిన ఒక సెట్‌ జిరాక్స్‌ సెట్లను వెంట తీసుకురావాలని తెలిపారు. శుక్రవారం 25 మంది వరకు అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన చేసినట్లు జిల్లా విద్యాశాఖ సిబ్బంది పేర్కొన్నారు. అభ్యర్థుల జాబితా ప్రకటించడం, అప్పటి నుంచే పరిశీలన కార్యక్రమాన్నీ చేపట్టడం, పరిశీలన తేదీల విషయ సమాచారం సాయంత్రం విడుదల చేయడం వంటివి ఒక్కరోజులోనే జరిగిపోవడం గమనార్హం.

ఇసుకాసురుల ఇష్టారాజ్యం!



■ రీచ్‌ల గుర్తింపులో అధికారుల నిర్లక్ష్యం
■ గోదావరి, వాగుల నుంచి అక్రమ రవాణా

న్యూస్‌టుడే, మల్లాపూర్‌

జగిత్యాల జిల్లా కలెక్టర్‌ ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నప్పటికీ.. కిందిస్థాయి మైనింగ్‌, పోలీస్‌, రెవెన్యూ సిబ్బంది పట్టీపట్టనట్లుగా వ్యవహరించడంతో ఇసుక వ్యాపారులు చెలరేగిపోతున్నారు. మల్లాపూర్‌, కోరుట్ల, మెట్‌పల్లి మండలాల పరిధిలో ప్రవహిస్తున్న పెద్దవాగు నుంచి నిత్యం ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పెద్ద మొత్తంలో వాగుల్లో ఇసుక నిల్వలు ఏర్పడటం అక్రమార్కులకు వరంగా మారింది. కొరత తీర్చేందుకు జగిత్యాల జిల్లా కేంద్రంతో పాటు కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లో ఇసుక డిపోలపై అధికారులు దృష్టి సారించడం లేదు. మల్లాపూర్‌ మండలంలోని పెద్దవాగు, గోదావరి ఇసుకకు డిమాండ్‌ ఉండటంతో మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల పట్టణాలకు ఆయా గ్రామాల్లోని నదుల నుంచి నేరుగా రవాణా చేస్తున్నారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి

జిల్లాలో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు, లారీలను పట్టుకుంటున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. అయినప్పటికీ ఇసుక అక్రమ రవాణా మాత్రం ఆగడంలేదు. జిల్లాలో ఇసుకకు ఉన్న డిమాండ్‌ దృష్ట్యా అవసరాలకు సంబంధించి రీచ్‌లను ఏర్పాటు చేయడంలో అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలు ఎక్కువ ధరకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇసుక అక్రమ రవాణా దారులు ఇసుకాసురులుగా ధరలను నిర్ణయిస్తూ రాత్రి, పగలు తేడా లేకుండా అందినకాడికి దోచుకుంటున్నారు. రీచ్‌లను ఏర్పాటు చేసి ఇసుక విక్రయించడం ద్వారా ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరే అవకాశాలు ఉన్నా.. జగిత్యాల చుట్టుపక్కల ఉన్న జిల్లాలో ఇలాంటి ఏర్పాట్లు ఉన్నప్పటికీ జిల్లాలో మాత్రం అధికారులు రీచ్‌లను ఏర్పాటు చేయడంలేదు. మరోవైపు గోదావరి పరీవాహక మండలాలతో పాటు వాగుల నుంచి ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్నారు.



వెంపల్లి శివారులోని పెద్దవాగులో ఇసుకను ట్రాక్టర్లలో నింపుతున్న దృశ్యం

ట్రాక్టర్లలో తీసుకొచ్చి టిప్పర్లతో తరలింపు

నిత్యం పెద్దవాగులో విస్తారంగా ఉన్న ఇసుకను కూలీల సాయంతో ట్రాక్టర్లలో తీసుకువచ్చి రహదారికి సమీపంలో డంపులు ఏర్పాటు చేస్తారు. రాత్రి వేళ డంపుల నుంచి టిప్పర్లలో పట్టణ ప్రాంతాలకు తరలిస్తారు. మల్లాపూర్‌, కోరుట్ల మండలాల నుంచి టిప్పర్లలో నిజామాబాద్‌, నిర్మల్‌ ప్రాంతాలకు పంపుతున్నట్లు తెలుస్తోంది. డిమాండ్‌ను బట్టి కొన్ని సందర్భాల్లో హైదరాబాద్‌ వరకు చేరవేస్తున్నట్లు సమాచారం. ఇంత జరుగుతున్నా అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.

రెవెన్యూ, పోలీస్‌ శాఖలు అభాసుపాలు

ఇసుక విషయంలో రెవెన్యూ, పోలీస్‌ శాఖలు అభాసుపాలవుతున్నాయి. స్థానికంగా అనుమతి ఉన్న రీచ్‌లు లేకపోవడంతో జిల్లాలో గోదావరి తీర ప్రాంతాలతో పాటు వాగుల నుంచి పెద్ద ఎత్తున ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. దీనికి తోడు ఆయా శాఖల అధికారులకు భారీగా ముడుపులు అందుతుండటంతో అటువైపు చూడటంలేదన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. అడపాదడపా తనిఖీలు జరుపుతూ కేసులు నమోదు చేస్తున్నప్పటికీ పూర్తిస్థాయిలో ఇసుక రవాణాను అరికట్టలేకపోతున్నారు. ఈ దందాపై ఉన్నతస్థాయి అధికారులు దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

అంత్యక్రియలకు వెళ్లొస్తూ.. అనంతలోకాలకు

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు



రాయమల్లు

బోయినపల్లి, న్యూస్‌టుడే: బోయినపల్లి మండలం వరదవెల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కరీంనగర్‌ జిల్లా గంగాధర మండలం రంగారావుపల్లికి చెందిన దేవయ్య, రాయమల్లు (40) అన్నదమ్ములు. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. జగిత్యాల జిల్లా మల్యాల మండలం మ్యాడంపల్లిలో దేవయ్య, రాయమల్లు పెద్దమ్మ మృతి చెందడంతో అంత్యక్రియలకు ద్విచక్ర వాహనంపై వెళ్లారు. అంత్యక్రియలు ముగిసిన అనంతరం ఒద్యారానికి చెందిన మరో పెద్దమ్మ కొడుకు ఎల్లయ్యను దింపడానికి బోయినపల్లి మీదుగా వస్తున్నారు. వరదవెల్లి ఆర్‌అండ్‌ఆర్‌ కాలనీ వద్దకు చేరుకోగానే ముందు వెళ్తున్న అదే గ్రామానికి చెందిన అంజయ్య ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టడంతో రాయమల్లు, దేవయ్య, ఎల్లయ్య కిందపడగా తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రికి తరలించగా రాయమల్లు మృతి చెందాడు. అతనికి భార్య రూప, కొడుకులు రఘు, గుణ ఉన్నారు. అంజయ్యను వేములవాడ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి

కోడలు, మనవరాలిని కాపాడబోయి విషాదం



రాజయ్య

ధర్మారం, న్యూస్‌టుడే: కోడలు, మనవరాలిని విద్యుదాఘాతం నుంచి కాపాడబోయి కూలీ మృతి చెందిన ఘటన ధర్మారం మండలం కటికెనపల్లిలో విషాదం నింపింది. ఎస్సై లక్ష్మణ్‌ కథనం ప్రకారం గ్రామానికి చెందిన మామిడి రాజయ్య(55) ఇంట్లో శుక్రవారం దుస్తులు ఆరేసుకునే దండేనికి విద్యుత్తు సరఫరా అయింది. ఇల్లు కడుగుతున్న రాజయ్య కోడలు శిరీష దాన్ని తాకడంతో షాక్‌ కొట్టింది. అక్కడే ఉన్న ఆమె కూతురు సంకీర్తనకూ విద్యుత్తు ప్రసారం కావడంతో ఇద్దరూ కేకలు వేశారు. ఇంటి బయట ఉన్న రాజయ్య వెంటనే ఇంట్లోకి వెళ్లి వారిని కాపాడే ప్రయత్నంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందారు. శిరీష, సంకీర్తనలను ఆసుపత్రికి తరలించారు. రాజయ్యకు భార్య, ఇద్దరు కొడుకులున్నారు. అతడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

లంచం తీసుకుంటూ పట్టుబడిన ఉద్యోగికి జైలు

కరీంనగర్‌ న్యాయవార్తలు, న్యూస్‌టుడే: గతంలో ప్రభుత్వ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తూ లంచం తీసుకున్న కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన మోకరాల శ్రీధర్‌కు నాలుగేళ్ల జైలు శిక్ష విధిస్తూ కరీంనగర్‌ అవినీతి నిరోధక శాఖ ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి కుమార్‌ వివేక్‌ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్‌ కథనం మేరకు.. ఆదిలాబాద్‌ జిల్లాలోని ప్రభుత్వ కోలం ఆశ్రమ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహించిన నరసింహారెడ్డి.. రికార్డుల నిర్వహణ సరిగా లేని కారణంగా వారంపాటు సస్పెన్షన్‌కు గురయ్యారు. తదుపరి ప్రాజెక్టు డైరెక్టర్‌ అతడి సస్పెన్షన్‌ను రద్దు చేస్తూ ఆ వారం రోజులను ఎర్నెడ్‌ సెలవుల కింద పరిగణించాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను అమలు చేయాలని 2009, ఏప్రిల్‌ 13న ఉట్నూర్‌లోని ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్‌ మోకరాల శ్రీధర్‌ను నరసింహారెడ్డి ఆశ్రయించగా రూ.మూడు వేల లంచం డిమాండ్‌ చేశాడు. దీంతో నరసింహారెడ్డి 2009, ఏప్రిల్‌ 23న ఆదిలాబాద్‌లోని ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా అనిశా ఇన్‌స్పెక్టర్‌ కిరణ్‌కుమార్‌.. రూ.3 వేల లంచం తీసుకున్న డిప్యూటీ డైరెక్టర్‌ శ్రీధర్‌ను అరెస్ట్‌ చేసి కేసు నమోదు చేశారు. తదుపరి ఇన్‌స్పెక్టర్‌ మోహన్‌.. కోర్టులో ఈ మేరకు ఛార్జిషీట్‌ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్‌ తరపున పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ కిషోర్‌కుమార్‌ వాదించారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి కుమార్‌ వివేక్‌ శుక్రవారం శ్రీధర్‌కు నాలుగేళ్ల జైలు శిక్షతోపాటు రూ.6 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. కేసు నమోదు చేసినప్పుడు శ్రీధర్‌ వయసు 56 సంవత్సరాలు. ప్రస్తుతం 70 ఏళ్ల వయసులోనూ ఆయనకు శిక్ష తప్పకపోవడం గమనార్హం.

ప్రగతి చక్రం.. పర్యావరణ హితం

న్యూస్‌టుడే, కరీంనగర్‌ రవాణా విభాగం

టీజీఎస్‌- ఆర్టీసీ పర్యావరణహితంతోపాటు ఇంధన భారం తగ్గించుకోవాలనే ఉద్దేశంతో ఎలక్ట్రిక్‌ బస్సులను ప్రయాణికులకు అందుబాటులోకి తెస్తోంది. ఇందుకోసం జేబీఎం సంస్థతో ఒప్పందం కూడా చేసుకుంది. ఇందులో భాగంగా కరీంనగర్‌ రీజియన్‌కు 70 ఎలక్ట్రిక్‌ బస్సులను కేటాయించారు. మొదటి విడతగా ఇప్పటికే 35 సూపర్‌లగ్జరీ బస్సులు కరీంనగర్‌కు చేరుకున్నాయి. వాయిదా పడుతూ వస్తున్న ఎలక్ట్రిక్‌ బస్సుల ప్రారంభానికి ముహూర్తం నిర్ణయించారు.

కరీంనగర్‌-2 డిపో కేంద్రంగా..

ఎలక్ట్రిక్‌ బస్సులను కరీంనగర్‌-2 డిపో కేంద్రంగా నడుపుతారు. ఇందుకోసం డిపో ఆవరణలో అవసరమైన ఛార్జింగ్‌ పాయింట్లను ఏర్పాటు చేశారు. ఈ ఎలక్ట్రిక్‌ బస్సుల్లో ప్రయాణికుల కోసం అధునాతన సౌకర్యాలు కల్పించారు. ఆర్టీసీ వీటిని అద్దె ప్రాతిపదికన నడపనున్నారు. చోదకులతోపాటు ఇతర నిర్వహణ మొత్తం జేబీఎం సంస్థే చూసుకుంటుండగా ఆర్టీసీ మాత్రం కండక్టర్ల పర్యవేక్షణ బాధ్యతలు చూసుకుంటుంది. ఇప్పటికే జేబీఎం సంస్థ డ్రైవర్లను నియమించుకొని వారికి శిక్షణ కూడా ఇచ్చింది.

రేపట్నుంచి రోడ్డెక్కనున్న ఎలక్ట్రిక్‌ బస్సులు

ఏర్పాట్లు పూర్తి

ఎలక్ట్రికల్‌ బస్సులు రహదారిపై పరుగులు తీయడానికి అవసరమైన ఏర్పాట్లను ఆ సంస్థ పూర్తి చేసింది. బస్సుల రిజిస్ట్రేషన్‌తో పాటు ఇతర ప్రక్రియలను పూర్తి చేసింది. మరో 4 డీలక్స్‌ బస్సులు వచ్చినా వాటికి సంబంధించిన రిజిస్ట్రేషన్‌, ఇతర ప్రక్రియలు మాత్రం పూర్తి కావాల్సి ఉంది.

కరీంనగర్‌ నుంచి..

మార్గం	బస్సుల సంఖ్య
జేబీఎస్‌	39
గోదావరిఖని	9
మంథని	4
కామారెడ్డి	6
జగిత్యాల	6
రాజన్న సిరిసిల్ల	6

(ఇలా రూట్‌ వారీగా బస్సులు నడపాలని ఆర్టీసీ నిర్ణయించినా.. మొదటి విడతలో వచ్చిన బస్సుల్లో 33 బస్సులను కేవలం జేబీఎస్‌కు మాత్రమే నడపనున్నారు. రెండు బస్సులు స్పేర్‌గా ఉంచుతారు. రెండో విడతలో వచ్చే బస్సులను ఇతర ఎంపిక చేసిన మార్గంలో నడపనున్నారు.)



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఎలక్ట్రిక్‌ బస్సులు

జిల్లాకు రానున్న మంత్రులు

ఈ నెల 29న ఎలక్ట్రికల్‌ బస్సుల ప్రారంభానికి అధికారులు సర్వం సిద్ధం చేశారు. మంత్రులు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సంస్థ ఎండీ సజ్జనార్‌ కరీంనగర్‌ రానున్నారు. అంబేడ్కర్‌ స్టేడియంలో ఉదయం 9 గంటలకు మంత్రుల చేతుల మీదుగా ఎలక్ట్రిక్‌ బస్సుల ప్రారంభం జరగనుంది. ఇప్పటికే అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్‌ఎం సుచరిత తెలిపారు.

ఉమ్మడి జిల్లాకు మోస్తరు వర్షసూచన

జగిత్యాల వ్యవసాయం: ఉమ్మడి జిల్లాలో రాగల అయిదురోజుల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షంకురిసే అవకాశముందని పొలాస పరిశోధనస్థానం శాస్త్రవేత్త బి. శ్రీలక్ష్మి తెలిపారు. ఉష్ణోగ్రతలు కనిష్ఠంగా 22-24 డిగ్రీలు, గరిష్ఠంగా 32-36 డిగ్రీల సెల్సియస్‌ వరకు నమోదవుతాయని వివరించారు.

పత్తి గరిష్ఠ ధర రూ.7,400

జమ్మికుంట, న్యూస్‌టుడే: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌కు శుక్రవారం 36 ట్రాలీల పాత, కొత్తపత్తిని రైతులు విక్రయానికి తీసుకొచ్చారు. విడిపత్తి క్వింటాలుకు రూ. కనిష్ఠ ధర రూ.7,000.. గరిష్ఠ ధర రూ.7,400 పలికింది. బస్తాల పత్తి రూ.6 వేల నుంచి రూ.7,700 దాకా వ్యాపారులు ఖరీదు చేశారు. కొత్తపత్తిని విక్రయానికి తీసుకొచ్చిన రైతులను మార్కెట్‌ కార్యదర్శి రాజా సన్మానించారు.

పరీక్ష ఫలితాల విడుదల

కరీంనగర్‌ కలెక్టరేట్‌, న్యూస్‌టుడే: శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలో ఆగస్టులో నిర్వహించిన ఎమ్మెస్సీ పరీక్ష ఫలితాలు విడుదల చేసినట్లు ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డా.శ్రీరంగప్రసాద్‌ ఒక ప్రకటనలో తెలిపారు. మైక్రోబయాలజీ, ఫుడ్‌ సైన్స్‌, డాటా సైన్స్‌, మ్యాథమెటిక్స్‌) నాలుగు, రెండో సెమిస్టర్‌ ఫలితాలు వెబ్‌సైట్‌ www.satavahana.ac.in లో అందుబాటులో ఉంచామని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నాలుగో సింహానికి ఏమైంది?



తరచూ వివాదాల్లో పోలీసులు

ఈనాడు, కరీంనగర్‌

ప్రజల మన్ననలు పొందుతూ మెరుగైన సేవలు అందించాల్సిన పోలీసు శాఖలో కొందరు అధికారులు, సిబ్బంది దుందుడుకుగా వ్యవహరిస్తూ, వక్రమార్గంలో పయనిస్తూ శాఖ ప్రతిష్ఠను దిగజారుస్తున్నారు. పేరుకే ఫ్రెండ్లీ పోలీసులమనే పంథాను చేతల్లో చూపుతున్నారు. చట్టాలు, నిబంధనల్ని తోసిరాజని.. తమకు నచ్చిన తీరుతో బాధితులతో ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారు. శాంతిభద్రతలు, నేరాల అదుపుపై దృష్టి పెట్టడం కన్నా 'మాకేంటి లాభమనే' విధంగా కొందరు వ్యవహరిస్తున్నారు. అవసరమైన వాటి విషయంలో కాకుండా అనవసరమైన వాటి విషయంలో దూకుడును ప్రదర్శిస్తున్నారు.

■ జగిత్యాల జిల్లాలో పని చేస్తున్న మహిళా ఎస్సై తీరుపై ఇటీవల ఆరోపణలు వచ్చాయి. భార్యాభర్తల కేసు విషయంలో కౌన్సెలింగ్‌ చేయకుండా ఎస్సై కొట్టడంతో తన సోదరుడు ఒంటికి నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఆయన సోదరి రెండు రోజుల కిందట వీడియో విడుదల చేశారు. చికిత్స పొందుతూ గురువారం ఆయన మృతి చెందాడు.

■ జగిత్యాల జిల్లాలోని ఓ మహిళా కానిస్టేబుల్‌ ఇంటి వద్ద జరిగిన గొడవ విషయంలో మరో మండలానికి చెందిన ఎస్సైపై ఆరోపణలు వచ్చాయి. అధికారులు విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదించగా చర్యలు కూడా తీసుకున్నారు.

■ కరీంనగర్‌ రెండో ఠాణాలో గతంలో పనిచేసిన ఓ సీఐ ఈ నెల 20న సస్పెండ్‌ అయ్యారు. నగరంలోని ఓ వ్యాపారి ఫైనాన్స్‌ కార్యాలయానికి సంబంధించి రూ.19,66,900లను తనిఖీల్లో భాగంగా ఆ సీఐ ఆధ్వర్యంలో పట్టుకెళ్లారు. నిబంధనల ప్రకారం బాధితుడికి తిరిగి ఇచ్చే నగదులో సీఐ కేవలం రూ.9లక్షలు మాత్రమే ఇచ్చి మిగతాది ఇచ్చేది లేదని, డబ్బు అడిగితే వేరే కేసులో ఇరికించి ఇబ్బందులు పెడుతానని హెచ్చరించారు. బాధితుడు భయంతో హైదరాబాద్‌కు మకాం మార్చారు. అక్కడి ఉన్నతాధికారులతోపాటు కరీంనగర్‌ సీపీని కొన్నాళ్ల కిందట కలిసి తన గోడుని వెలిబుచ్చడంతో విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు సీఐ అక్రమాన్ని గుర్తించి విధుల నుంచి తప్పిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

అవినీతి బాటలో..

ఈ ఏడాది జూన్‌ 23న జగిత్యాల జిల్లా రాయికల్‌కు చెందిన ఓ ఎస్సై మధ్యవర్తి ద్వారా లంచం తీసుకునేందుకు ప్రయత్నించిన తీరు సంచలనాన్ని రేకెత్తించింది. అనిశా అధికారులకు చిక్కకుండా ఆయన పరారైన తీరు పోలీసు శాఖకు తలవంపులు తెచ్చింది. గతంలోనూ సిరిసిల్ల జిల్లాలో ఇసుక ట్రాక్టర్‌ను విడిపించేందుకుగానూ లంచం అడిగారనే నెపంతో సీఐ, ఎస్సై, కానిస్టేబుళ్లను ఎస్పీ కార్యాలయంలోనే అనిశా అధికారులు పట్టుకున్న సంగతి ఇంకా ప్రజలు మరిచిపోలేదు. కరీంనగర్‌ కమిషనరేట్‌ పరిధిలో భూమాఫియాకు వత్తాసు పలికారనే అభియోగాలతో సొంత శాఖ ఉన్నతాధికారుల విచారణను నలుగురైదుగురు ఎదుర్కొన్నారు. పెద్దపల్లి జిల్లాలోనూ అక్కడక్కడా పోలీసులు అత్యుత్సాహాన్ని చూపించిన ఉదంతాలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కీలకమైన ఠాణాల్లో కొందరు కేసుల సెటిల్‌మెంట్లకు అడ్డాగా మార్చుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఇసుక, క్వారీలు, ఇతరత్రాలుగా నెలవారీ మామూళ్ల నెపంతో అమ్యామ్యాలను అందుకుంటున్నారనే విమర్శలు బాహాటంగా వినిపిస్తున్నాయి.

హెచ్చరిస్తున్నా.. మార్పు లేదు

ప్రభుత్వంతోపాటు రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పోలీసుల వైఖరిలో మంచి మార్పు తీసుకు రావాలని పలుమార్లు హెచ్చరిస్తున్నా.. పలువురి వైఖరి మాత్రం మారడం లేదు. ఎవరేమంటారనే ధీమాతో అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. అప్పుడప్పుడు వెలుగు చూస్తున్న అక్రమాలు, ఆరోపణలు శాఖకు మచ్చకు తీసుకొస్తున్నప్పటికీ ప్రజలతో వ్యవహరించే తీరులో ఇంకా మార్పు రావడం లేదు. కేసు నమోదు చేయాలన్నా.. నమోదు కాకుండా ఆపాలన్నా.. ఇంత రేటని వసూలు చేయడం చాలా ఠాణాల్లో కొనసాగుతోందన్న ఆరోపణలున్నాయి. ఇక కొందరు తమ మార్కు ఇదేననే విధంగా మాటలతో బాధితులపై విరుచుకుపడుతున్న ఉదంతాలున్నాయి. మర్యాద మాట అటుంచితే 'అరేయ్‌'.. అనే హూంకరింపు మొదలు బూతు పదాలతో రెచ్చిపోతున్నారు. ఈ ఏడాది ఆగస్టు 10న మెట్‌పల్లి ఠాణా ప్రాంగణంలో మహిళను పక్కకు నెట్టి లాఠీ ఎత్తిన సంఘటనకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. ఇలా ఎక్కడికక్కడే పోలీసు సేవల్లో ఇబ్బందికర పరిస్థితిని ప్రజలు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితిలో మార్పు వచ్చేవిధంగా ఉన్నతాధికారులు మరింత శ్రద్ధ కనబరచాలని ప్రజలు కోరుకుంటున్నారు.

బాలలు.. ఇక పర్యాటక నేస్తాలు

న్యూస్‌టుడే, సిరిసిల్ల కలెక్టరేట్‌

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు పర్యాటకంపై అవగాహన కల్పించాలనే లక్ష్యంతో పాఠశాలల్లో ప్రభుత్వం యువ టూరిజం క్లబ్‌ల ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేసింది. సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడేందుకు, పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసింది.

పాఠశాలల్లో ఏడు నుంచి 12వ తరగతి చదివే విద్యార్థులతో ఈ క్లబ్‌లను ఏర్పాటు చేయనున్నారు. వీటిలో 25 నుంచి 29 మంది సభ్యులుగా ఉంటారు. ప్రతి క్లబ్‌కు ఒక విద్యార్థి నాయకుడిగా, ఒక ఉపాధ్యాయుడు సమన్వయకర్తగా ఉంటాడు. ఈ క్లబ్‌లు పర్యాటక రంగానికి సంబంధించిన వివిధ అంశాలపై దృష్టి సారిస్తాయి.



పాఠశాలల్లో యువ టూరిజం క్లబ్‌లు

■ క్లబ్‌ సభ్యులు విద్యార్థులలోని ఉత్సాహం, సాహసోపేతం, సృజనాత్మకత, ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తారు. ■ మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో విజ్ఞాన, విహార యాత్ర, శాస్త్ర సాంకేతికత, ఉన్నత విద్యాసంస్థలు, చారిత్రక కట్టడాల సందర్శనలు చేసి తోటి విద్యార్థులకు అక్కడి విశేషాలను వివరించనున్నారు.

■ జిల్లాలోని పాఠశాలల్లో సోమవారం నుంచి ఈ క్లబ్‌లను ఏర్పాటు చేయాలని ఇప్పటికే జిల్లా విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పర్యాటక రంగంపై అవగాహన కల్పించేందుకు ఈ క్లబ్‌లను ఏర్పాటు చేస్తుంది. విద్యార్థులు, యువతకు దేశంలోని సంస్కృతి, సంప్రదాయాలపై తర్వాత తరానికి అవగాహన కల్పిస్తాయి. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం తప్పనిసరిగా పాఠశాలల్లో ఈ క్లబ్‌లను ఏర్పాటు చేయాలి.

\- శైలజ, జిల్లా సమన్వయకర్త

ప్రచారమే లక్ష్యం

దేశంలో ముఖ్యంగా రాష్ట్రంలోని విభిన్న సంస్కృతులు, భౌగోళిక పరిస్థితుల గురించి విద్యార్థులకు, యువతకు అవగాహన కల్పించడం, పర్యాటకం, పర్యావరణం, ప్రకృతి పట్ల స్నేహం, ప్రయాణ మనస్తత్వాన్ని నేటి యువతలో ఈ క్లబ్‌లు పెంపొందిస్తాయి.

■ యువత, రాబోయే తరానికి పర్యాటక ప్రాముఖ్యతను వివరిస్తూ దేశంలోని అనేక కళలు, సాంస్కృతిక రూపాల ప్రశంసలకు దోహదపడే విభిన్న కార్యకలాపాలను చేపడతాయి.

■ పర్యాటకం, తెలంగాణ, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు సంబంధించిన కార్యక్రమాల్లో పాలుపంచుకుంటాయి.

■ విద్యార్థులతో ఈ ప్రాంత పర్యాటకంపై ప్రచారం చేసే బాధ్యతను ఈ క్లబ్‌లు తీసుకొంటాయి.

ప్రాజెక్టుల నుంచి నీటి విడుదల

బోయినపల్లి, న్యూస్‌టుడే : మధ్యమానేరు జలాశయం నుంచి ఎల్‌ఎండీకి శుక్రవారం ఆరు గేట్ల నుంచి 13,930 క్యూసెక్కుల నీటిని వదిలారు. జలాశయానికి ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 12,100 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. జలాశయం పూర్తి సామర్థ్యం 27.5 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 26.45 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

జగిత్యాల ధరూర్‌క్యాంపు: శ్రీరామసాగర్‌ ప్రాజెక్టులోకి 40,586 క్యూసెక్కుల వరద వస్తుండగా 4 స్పిల్‌వే గేట్లద్వారా 12,496 క్యూసెక్కులను, ఎస్కేప్‌ గేట్లద్వారా 1,200 క్యూసెక్కుల మిగులు జలాలను శుక్రవారం గోదావరిలోకి వదిలారు. ప్రాజెక్టు నుంచి వరదకాలువకు 19 వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువ, విద్యుత్తు ఉత్పత్తికి 6,800 నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టులో గరిష్ఠస్థాయిలో 80.501 టీఎంసీల నీరు నిలువుంది.

గోదావరిఖని: ఎల్లంపల్లి శ్రీపాదసాగర్‌ ప్రాజెక్టు 14 గేట్లు ఎత్తి 1.47 లక్షల క్యూసెక్కుల నీటిని శుక్రవారం దిగువకు వదిలారు. మధ్యాహ్నం అనంతరం ఎగువ నుంచి నీటి ప్రవాహం పెరగడంతో దిగువకు నీటిని వదిలారు. ప్రస్తుతం శ్రీరాంసాగర్‌ నుంచి 81,224 క్యూసెక్కులు, వరద నీరు 66,259 క్యూసెక్కులు చేరడంతో బ్యారేజీ నీటి మట్టం పెరిగింది. అప్రమత్తమైన అధికారులు 14 గేట్లను ఎత్తారు.

మెరుగైన వైద్యం అందించాలి

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: రోగులకు తగిన వైద్య పరీక్షలు నిర్వహించి జ్వరాలను కట్టడి చేయాలని కలెక్టర్ శ్రీహర్ష పేర్కొన్నారు. శుక్రవారం సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి వ్యాపార సముదాయాల గదుల అద్దె పెంపునకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. రోగులకు మెరుగైన వైద్యం అందించేలా చొరవ చూపాలన్నారు. ఆసుపత్రికి విద్యుత్తు సౌకర్యం కోసం జనరేటర్‌తో పాటు ఈసీజీ ఇతర అవసరాలపై వైద్యులు ఆయన దృష్టికి తీసుకెళ్లగా సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వైద్యులు రమాదేవి, రాజు, సతీశ్, కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

రామునిగుండాల వద్ద 'స్వచ్ఛతా హీ సేవా'


రాముని గుండాల పరిసరాలను శుభ్రం చేస్తున్న నగరపాలక సిబ్బంది

గోదావరిఖని పట్టణం, న్యూస్‌టుడే: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని రామగుండం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్థానిక రాముని గుండాల వద్ద శుక్రవారం 'స్వచ్ఛతాహీ సేవ' కార్యక్రమాన్ని నిర్వహించారు. కొండపై, దేవాలయం సమీపంలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు. నగరపాలక కార్యదర్శి రాజు, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు సునీల్, ఆరోగ్య సహాయకుడు సునీల్‌రాథోడ్, పర్యావరణ ఇంజినీర్ మధుకర్, ఎం.ఐ.ఎస్. ఆపరేటర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

దర్యాప్తు నిలిపివేతకు ఉత్తర్వులు

మంథని, న్యూస్‌టుడే: మంథనికి చెందిన ఇనుముల సత్యనారాయణపై మంథని, రామగిరి ఠాణాల్లో నమోదైన అక్రమ వసూళ్లకు సంబంధించిన నాలుగు కేసుల్లో దర్యాప్తు నిలిపివేయాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందని ఆయన భార్య, పిటిషన్‌దారు విజేత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మాజీ ఎమ్మెల్యే, ఆయన అనుచరులు సత్యనారాయణపై తప్పుడు ఆరోపణలు చేస్తూ కేసులతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని హైకోర్టులో రిట్ పిటిషన్ వేసినట్లు చెప్పారు. తుది ఉత్తర్వులు వెలువడే వరకు దర్యాప్తు నిలిపివేయాలని పోలీసు శాఖకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు.

వనరుల దోపిడీ అరికట్టాలి

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: మంథని ప్రాంతానికి చెందిన వనరులు దోపిడీకి గురవుతున్నాయని భారాస మండల అధ్యక్షుడు శంకేషి రవీందర్ అన్నారు. శుక్రవారం ఆయన సెంటినరీకాలనీలో విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ముందు దోపిడీని అరికడతామని చెప్పిన మంత్రి ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. పెద్దపల్లి ఎమ్మెల్యే సాండ్ ట్యాక్సీని రద్దు చేయించి ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు స్థానికుల అవసరాలకు ఇసుకను ఉచితంగా తీసుకెళ్లడానికి అనుమతి ఇప్పించారన్నారు. మంథనిలో అదే విధానాన్ని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. పార్టీ నాయకులు సత్యనారాయణ, కుమార్‌యాదవ్, రాజసంపత్, కిరణ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

మంథని, న్యూస్‌టుడే: మంథని మున్సిపల్ పరిధిలోని 4వ వార్డు గంగాపురిలో భూగర్భ మురుగుకాలువ, రహదారి పనులను శుక్రవారం ఛైర్‌పర్సన్ రమాదేవి ప్రారంభించారు. మంత్రి శ్రీధర్‌బాబు సహకారంతో 13 వార్డుల్లో రూ.కోటి చొప్పున వెచ్చించి పనులు చేపడుతున్నామని చెప్పారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా నిర్వహించి మహాలక్ష్మి ఆలయం పక్కనే ఉన్న రావుల చెరువులో పిచ్చిమొక్కలను తొలగించారు. ఇన్‌ఛార్జి కమిషనర్ మనోహర్, కౌన్సిలర్లు హనుమంతు, లింగయ్య, వి.కె.రవి, నాగేంద్ర, విజయలక్ష్మి పాపారావు పాల్గొన్నారు.


గంగాపురిలో పనులు ప్రారంభిస్తున్న ఛైర్‌పర్సన్ రమాదేవి

రైల్వే ట్రాక్ పక్కన యువకుడి మృతదేహం

ఓదెల, న్యూస్‌టుడే: రైలు ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన ఓదెల మండలంలో ఆలస్యంగా వెలుగుచూసింది. రామగుండం జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ తిరుపతి కథనం ప్రకారం మధ్యప్రదేశ్‌లోని సాత్నా జిల్లా విశాల్‌పూర్‌కు చెందిన నూతన్‌కుమార్ యాదవ్(25) సోదరునితో కలిసి మార్బుల్ పాలిష్ పనులు చేస్తూ పెద్దపల్లిలో నివాసం ఉంటున్నారు. ఈ నెల 19న ఓదెల మండలం కొలనూరులో పని చేసేందుకు వచ్చారు. సాయంత్రం తిరిగి పెద్దపల్లికి వెళ్తున్నానంటూ నూతన్‌కుమార్ మద్యం మత్తులో ఒంటరిగా రైల్వే ట్రాక్ వెంట నడుచుకుంటూ వెళ్తూ గుర్తు తెలియని రైలు ఢీకొని ట్రాక్ పక్కన తుమ్మ పొదల్లో పడిపోయాడు. అప్పటి నుంచి ఆచూకీ తెలియకపోగా శుక్రవారం రైల్వే సిబ్బంది ట్రాక్ పక్కన తుమ్మ పొదల మధ్య కుళ్లిన మృతదేహాన్ని గుర్తించారు. రైల్వే పోలీసులు పరిశీలించి మృతుడిని నూతన్‌కుమార్‌గా గుర్తించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

జిల్లా స్థాయి క్రీడలకు ఎంపిక


పోటీలకు ఎంపికైన విద్యార్థులతో గర్రెపల్లి ఉపాధ్యాయులు

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: ఇటీవల సుల్తానాబాద్‌లో నిర్వహించిన ఎస్జీఎఫ్ జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో గర్రెపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. అండర్-17, 14 బాలుర వాలీబాల్‌లో చరణ్, అజయ్, అక్షయ్, సాకేత్, బాలికల విభాగంలో అక్షిత, సమ్మక్క, చంద్రకళ, సహస్ర, అండర్-14 కబడ్డీలో చంద్రకళ, అండర్-17 బాలికల త్రోబాల్‌లో అక్షిత, అండర్-17 బాలుర త్రోబాల్‌లో అజయ్ ప్రతిభ కనబరిచారు. ప్రధానోపాధ్యాయురాలు కవిత, పీడీ ఆసియాబేగంలు వారిని అభినందించారు.

కాల్వశ్రీరాంపూర్: వెన్నంపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు శుక్రవారం మండల స్థాయి పోటీల్లో ప్రతిభ చూపారు. అండర్-14 బాలబాలికల్లో ఏ.తన్మయశ్రీ(ఖోఖో), ఏ.సాజిత(కబడ్డీ), ఎమ్.జీవన్(కబడ్డీ), అండర్-17లో టి.అజయ్(ఖోఖో), కె.చరణ్(కబడ్డీ), డి.సల్మా(కబడ్డీ) జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. అథ్లెటిక్స్‌లో అండర్-14లో 400 మీటర్ల పరుగులో రాంచరణ్, 200 మీటర్ల పరుగులో రిషిత్, డిస్కస్ త్రోలో నవహర్షిత్, అండర్-17లో 100 మీటర్ల పరుగులో చరణ్, 200 మీటర్ల పరుగులో కె.ప్రణవి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ఎంఈవో ఎస్.మహేశ్, పీఈటీ దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.


వెన్నంపల్లిలో విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కార్మికుడి తనయుడికి చెక్కు పంపిణీ

యైటింక్లయిన్‌కాలనీ, న్యూస్‌టుడే: ఓసీపీ-3 ఉద్యోగి సత్యనారాయణ కుమారుడు రాహుల్ ఐఐటీ ఇండోర్‌లో ఎంటెక్ సీటు సాధించారు.. ఆర్జీ-2 జీఎం ఎల్వీ సూర్యనారాయణ రూ.3.35లక్షల చెక్కును శుక్రవారం అందజేశారు. ఉన్నత విద్య నభ్యసించే ప్రతి ఒక్క కార్మికుడి కుమారునికి యాజమాన్యం ఆర్థిక సహకారం అందిస్తుందని జీఎం పేర్కొన్నారు.



భవిష్యనిధి కుంభకోణంపై విచారించాలని ధర్నా

గోదావరిఖని, న్యూస్‌టుడే: బొగ్గుగని కార్మికుల భవిష్య నిధిలో భారీ కుంభకోణం జరిగిందని ఆరోపిస్తూ.. సీబీఐతో విచారణ చేయించాలని డిమాండ్ చేస్తూ బీఎంఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్జీ-1 జీఎం కార్యాలయం ముందు ధర్నా చేశారు. కార్మికులకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందుబాటులోకి తీసుకురావాలని, మొత్తం లాభాలపై వాటా పంపిణీ చేయాలని నినాదాలు చేశారు. 250 గజాల స్థలం కేటాయింపు, రూ.50 లక్షల వడ్డీలేని రుణ సౌకర్యం కల్పించాలని కోరారు. అనంతరం పర్సనల్ మేనేజర్ కిరణ్ బాబుకు వినతి పత్రం అందజేశారు. నాయకులు సారంగపాణి, మహేశ్, సతీష్, హరీణ్, సాంబయ్య, రామ్మూర్తి, నర్సింహులు, రాజశేఖర్, శ్రీనివాస్, లక్ష్మయ్య పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న బీఎంఎస్ నాయకులు

భూ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించండి

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్(సీఎంపీఎఫ్)లో జరిగిన కుంభకోణంపై సీబీఐతో విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. సంస్థ సాధించిన వాస్తవ లాభాలను కార్మికులకు పంపిణీ చేయాలన్నారు. శుక్రవారం ఆర్జీ-3 జీఎం కార్యాలయం ఎదుట నిర్వహించిన మహాధర్నాలో ఆయన మాట్లాడుతూ భూ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ పర్సనల్ మేనేజర్ శ్రీహరికి అందజేశారు. డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వేణుగోపాలరావు, కేంద్ర కార్యదర్శి రవీందర్, ఏరియా ఉపాధ్యక్షుడు ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

'యాజమాన్యం.. ప్రభుత్వం కుట్ర'

గోదావరిఖని, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.30 వేల కోట్ల బకాయిలను అడగకుండా.. సంస్థ లాభాలను అభివృద్ధి కోసం కేటాయించడాన్ని సీఐటీయూ నాయకుడు ఎం.నర్సింహరావు ఖండించాడు. జీడీకే-5 ఓసీపీ, ఏరియావర్క్‌షాపుల్లో శుక్రవారం నిర్వహించిన ద్వార సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక సంవత్సరాలుగా నికర లాభాలపై కార్మికులకు వాటా చెల్లిస్తున్నారని, ఈ సంవత్సరం కొత్త ఒరవడిని తీసుకువచ్చిన ప్రభుత్వం, యాజమాన్యం కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. నాయకులు రాజమౌళి, శ్రీనివాస్, నరహరిరావు, విజయ్‌కుమార్, శ్రీనివాసరావు, గౌస్, వెంకటేశ్వర్లు, రహీంఖాన్ పాల్గొన్నారు.

'కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్న సంఘాలు'

గోదావరిఖని, న్యూస్‌టుడే: లాభాల వాటాపై కొన్ని కార్మిక సంఘాలు కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నాయని ఏఐటీయూసీ నాయకుడు వి.సీతారామయ్య పేర్కొన్నారు. జీడీకే-2 గనిపై శుక్రవారం నిర్వహించిన ద్వార సమావేశంలో ఆయన మాట్లాడారు. యాజమాన్యంతో మాట్లాడి.. దసరాకు ముందే అక్టోబరు 7న కార్మికులకు వాటా పంపిణీ చేయిస్తున్నామన్నారు. సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిపోయిందని, ఆదివారం బోనస్ కోసం దిల్లీలో జరిగే సమావేశంలో కార్మికులకు గతంలో కంటే ఎక్కువ మొత్తంలో చెల్లించే విధంగా ఒత్తిడి తెస్తామన్నారు. నాయకులు వై.వి.రావు, ఎల్లయ్యగౌడ్, రాంచందర్, అక్బర్‌అలీ, పోషం, రవీందర్, శ్రీనివాస్, వెంకటరెడ్డి, శంకర్, ఎం.ఎ.గౌస్, రామస్వామి, రవి, వెంకటయ్య పాల్గొన్నారు.

అభ్యర్థులకు నియామక పత్రాల అందజేత

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: అడ్రియాల ప్రాజెక్టు ఏరియాలోని ఎంవీటీసీలో 48 రోజుల శిక్షణ పూర్తయిన 27 మంది ఉద్యోగుల వారసులకు శుక్రవారం జీఎం కొప్పుల వెంకటేశ్వర్లు నియామక పత్రాలను అందజేశారు. ప్రాతినిధ్య సంఘం ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ఎస్‌వోటూ జీఎం సత్యనారాయణ, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ శ్రీహరి, ఎంవీటీసీ మేనేజర్ మల్లన్న, సీనియర్ పీవో రాజేశం, జూనియర్ అసిస్టెంట్ క్రాంతికిరణ్ పాల్గొన్నారు.



కొండా లక్ష్మణ్‌కు ఘన నివాళి

గోదావరిఖని, న్యూస్‌టుడే: ఆర్జీ-1 జీఎం కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జీఎం లలిత్‌కుమార్, గుర్తింపు సంఘం నాయకుడు పోశం, కిరణ్‌బాబు, ధనలక్ష్మీబాయి, సీఎంఓఏఐ ప్రతినిధి క్రాంతి పాల్గొన్నారు.


ఖని: కొండా లక్ష్మణ్‌బాపూజీ చిత్రపటం వద్ద అధికారులు, జీఎం లలిత్‌కుమార్

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ): రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్టు ఏరియాల ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్జీ-3 జీఎం కార్యాలయ ఆవరణలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతి వేడుకలు నిర్వహించారు. జీఎంలు నరేంద్ర సుధాకర్‌రావు, కొప్పుల వెంకటేశ్వర్లు హాజరై బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు రామచంద్రారెడ్డి, రవీందర్‌రెడ్డి, ఫైనాన్స్ ఏజీఎం శ్రీనివాసులు, ఎస్‌వోటూ జీఎం సత్యనారాయణ అధికారులు రాజారెడ్డి, సుధాకర్, జనార్దన్‌రెడ్డి, ఐలయ్య, శ్రీహరి, రాజేంద్రప్రసాద్, రాజేశ్వరి పాల్గొన్నారు.



ఆర్జీ-3లో నివాళులర్పిస్తున్న జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు

ఏఐటీయూసీతో సమస్యల పరిష్కారం

గోదావరిఖని, న్యూస్‌టుడే: ఒప్పంద కార్మికుల సమస్యలు ఏఐటీయూసీతోనే పరిష్కారమవుతాయని ఆ సంఘం నాయకుడు ఎం.ఎ.గౌస్ పేర్కొన్నారు. ఆర్జీ-1 ప్రాంతంలోని సెక్టార్-2 పారిశుద్ధ్య కార్మికుల వద్ద శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

గోదావరి ఒడ్డున స్వచ్ఛత

గోదావరిఖని, న్యూస్‌టుడే: స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా ఆర్జీ-1 అధికారులు శుక్రవారం గోదావరి ఒడ్డున, పరిసర ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. పరిశుభ్రతపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలన్నారు. అధికారులు రాంమోహన్, వెంకటేశ్వర్‌రావు, ఆంజనేయప్రసాద్, రవీందర్‌రెడ్డి, ఆంజనేయులు, ప్రభాకర్, హన్మంతరావు, అశోక్‌రావు, దుర్గాప్రసాద్, గుర్తింపు సంఘం నాయకుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

అక్రమ కట్టడాన్ని అడ్డుకున్న గ్రామస్థులు

ఓదెల, న్యూస్‌టుడే: జీలకుంట అంబేడ్కర్ కూడలిలోని ప్రభుత్వ భూమిలో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అక్రమంగా నిర్మాణం చేపట్టడంపై కలెక్టర్‌తో పాటు తహసీల్దార్, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శికి శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు గ్రామస్థులు తెలిపారు. ఆ భూమిలో స్థానికులు వినాయక మండపాన్ని ఏర్పాటు చేసుకోగా కూల్చే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. అధికారులు స్పందించి అక్రమ కట్టడాలను తొలగించాలని కోరుతూ స్థానికులు ఆందోళన చేపట్టారు. పొత్కపల్లి ఎస్సై జి.అశోక్‌రెడ్డి ఆందోళన విరమింపజేశారు. ప్రభుత్వ భూమికి హద్దులు నిర్ణయించాలని గ్రామస్థులు కోరారు.

ఇన్‌ఛార్జి కమిషనర్‌గా వెంకటేశ్

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: సుల్తానాబాద్ పురపాలక ఇన్‌ఛార్జి కమిషనర్‌గా వెంకటేశ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేసిన కమిషనర్ శోభాశంకర్ హైదరాబాద్‌కు బదిలీ కాగా పెద్దపల్లి కమిషనర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఛైర్‌పర్సన్ గాజుల లక్ష్మి, కౌన్సిలర్లు, కార్యాలయ అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కాగా రెండు నెలలుగా పుర కమిషనర్ లేక 'నిలిచిన పురపాలిక పౌర సేవలు' శీర్షికన ఈ నెల 18న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ శ్రీహర్ష స్పందించి ఈ నియామకం చేపట్టారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

కాల్వశ్రీరాంపూర్, న్యూస్‌టుడే: ఆయిల్ పామ్ సాగుతో రైతులు అధిక లాభాలు సాధించవచ్చని జిల్లా ఉద్యాన అధికారి సీహెచ్.జగన్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కూనారంలో మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ ఏడాది జిల్లాలో రెండు వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. పెద్దపల్లి డివిజన్ ఉద్యాన వనాధికారి ఎస్.మహేశ్, డ్రిప్ సంస్థ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి


కార్మికులకు సబ్బులు పంపిణీ చేస్తున్న డీపీవో వీరబుచ్చయ్య

బతుకమ్మ పండుగకు ఇబ్బందులు లేకుండా చర్యలు

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: గ్రామాల్లో బతుకమ్మ ఆడే ప్రదేశాల్లో విద్యుత్తు దీపాలను ఏర్పాటు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య సూచించారు. శుక్రవారం రామగిరి ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. పారిశుద్ధ్య కార్మికులకు సబ్బులు, కొబ్బరినూనె, బెల్లం పంపిణీ చేయాలన్నారు. అనంతరం స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. డీఎల్‌పీవో సతీశ్‌కుమార్, ఎంపీడీవో శైలజారాణి, తహసీల్దార్ రామచంద్రరావు, ఎంపీవో ఉమేశ్, వైద్యాధికారి ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.


పెద్దపల్లిలో బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు


మంథనిలో లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద భారాస నాయకులు


గోదావరిఖనిలో భారాస నాయకులు

మురుగుకు తాగునీరు పైపులు అడ్డు!

గోదావరిఖనిలోని ఆర్టీసీ డిపో వెనకాల ఉన్న ప్రధాన మురుగు కాలువ ప్రవాహానికి తాగునీటి పైపులైను అడ్డుగా మారింది. దీంతో పైపులైను వద్ద మురుగునీరు నిలిచి దుర్వాసన వస్తుంది. ఈ కాలువ పక్కనుంచే వైద్య కళాశాల, సప్తగిరి కాలనీలకు రాకపోకలు సాగిస్తుంటారు. మురుగునీటి నుంచి వచ్చే దుర్వాసనతో వారు ఇబ్బందులు పడుతున్నారు. దోమలు కూడా పెరిగే ప్రమాదం ఉంది. నగరపాలక అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

- న్యూస్‌టుడే, గోదావరిఖని పట్టణం



కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు

స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ తొలి దశ ఉద్యమ నేత ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ సంఘాల నేతలు ఆయనకు ఘన నివాళులర్పించారు. సమీకృత పాలనా ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే విజయరమణారావు హాజరయ్యారు.

-న్యూస్‌టుడే, యంత్రాంగం


కాలనీలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో..


అంతర్గాం మండల కేంద్రంలో..


రామగుండం నగరపాలికలో మేయర్ డాక్టర్ బంగి అనిల్‌కుమార్ తదితరులు

■ వ్యవసాయ ఉత్పత్తులపై విద్యార్థులకు అవగాహన

మార్కండేయకాలనీ: గోదావరిఖని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యవసాయ ఉత్పత్తులు, ధరల ప్రక్రియపై గురువారం పాఠశాల గైడ్ ఉపాధ్యాయుడు జగదీశ్వర్ అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇజ్రాయిల్, ఉపాధ్యాయులు శివశంకర్, అమూల్య, వాసవి, హర్షిణి, నిత్య, అభిరాజ, హర్షవర్ధన్ పాల్గొన్నారు.

■ నిర్మాణాల తొలగింపు

గోదావరిఖని పట్టణం: గోదావరిఖని తిలక్‌నగర్ కూడలి విస్తరణలో భాగంగా రామగుండం నగరపాలక పట్టణ ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్మాణాలను తొలగించారు. గురు, శుక్రవారాల్లో కూడలి చుట్టున్న 10 నిర్మాణాలను తొలగించినట్లు నగరపాలక పట్టణ ప్రణాళిక అసిస్టెంట్ సిటీ ప్లానర్ తెలిపారు.

■ రూపాయికే అంత్యక్రియలు ప్రవేశపెట్టాలని వినతి

గోదావరిఖని పట్టణం: కరీంనగర్ నగరపాలికలో మాదిరిగా రామగుండంలోనూ ఒక్క రూపాయికే అంత్యక్రియల విధానాన్ని ప్రవేశపెట్టాలని నగరపాలక 20వ డివిజన్ కార్పొరేటర్ సతీష్‌కుమార్ కోరారు. ఈ మేరకు నగర మేయర్ డాక్టర్ అనిల్‌కుమార్‌కు శుక్రవారం ఆయన వినతిపత్రం అందించారు.

■ బాధిత కుటుంబానికి బియ్యం పంపిణీ

గోదావరిఖని పట్టణం, న్యూస్‌టుడే: రామగుండం నగరపాలక 32వ డివిజన్‌కు చెందిన మహిళ మామిడి కోమల కుటుంబానికి సీతారామసేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం 50 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కోమల భర్త ఇటీవల చనిపోయాడు. సేవా సమితి నిర్వహకురాలు గోలివాడ చంద్రకళ, 32వ డివిజన్ కార్పొరేటర్ శివకుమార్, సమితి సభ్యులు సుజాత, లక్ష్మి, స్వప్న, రాజేశ్వరి పాల్గొన్నారు.

■ వైద్య కళాశాలలో ఉద్యోగం కల్పించాలని కలెక్టర్‌కు విన్నపం

పాలకుర్తి: అంతర్గాం మండలం లింగాపూర్‌కు

సంక్షిప్తం

చెందిన శివాని, శిల్పా అనే అనాథ బాలికలను రామగుండం వైద్య కళాశాలలో ఉద్యోగం కల్పించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ శ్రీహర్షకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అయిదు సంవత్సరాల క్రితం తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన ఈ అక్కాచెల్లిని అప్పటి మంత్రి కేటీఆర్ సూచనతో గతంలో ఉన్న కలెక్టర్ ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని మాట ఇచ్చారు. సామాజిక కార్యకర్త నిమ్మలరాజుల రవి వీరిద్దరి నర్సింగ్ చదువుకు సాయం చేశారు. కోర్సు పూర్తి కావడంతో కలెక్టర్‌ను కలిసి గోడు విన్నవించారు.

■ పద్మశాలీ కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి

సుల్తానాబాద్: పద్మశాలీ కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే విజయరమణారావు పేర్కొన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం సుల్తానాబాద్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పద్మశాలీ సంఘాల సామాజిక భవనాల నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. పుర ఛైర్‌పర్సన్ లక్ష్మి, సంఘం జిల్లా అధ్యక్షుడు రామ్మూర్తి, సభ్యులు పాల్గొన్నారు.

■ కుక్కల దాడిలో దూడ మృతి

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ): రామగిరి మండలం రామయ్యపల్లిలో కుక్కలు బీభత్సం సృష్టిస్తున్నాయి. శుక్రవారం గ్రామంలోని దూడపై దాడి చేసి హతమార్చాయి. దేవునూరి సత్యనారాయణకు చెందిన దూడను ఇంటి ఆవరణలో కట్టేశాడు. కుక్కలు దానిపై దాడి చేసి చంపి కొంత భాగం తిన్నాయి. కుక్కల బెడద తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

■ రైతుల అభ్యున్నతికి కృషి

కమాన్‌పూర్: రైతుల అభ్యున్నతికి సమష్టిగా పని చేద్దామని సింగిల్‌విండో ఛైర్మన్ ఇనగంటి భాస్కర్‌రావు అన్నారు. కమాన్‌పూర్‌లోని ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో పలు అంశాలపై సమీక్షించారు. సంఘంలో 560 మంది రైతులకు రూ.3,95,45,081 రుణ మాఫీ జరిగిందన్నారు. మాఫీ వర్తించిన 468 మందికి తిరిగి రూ.3,62,71,000 రుణం ఇచ్చామన్నారు. కొత్తగా మరో 103 మంది రైతులకు రుణం ఇచ్చామన్నారు. సంఘం సీఈవో సంతోశ్, వైస్ ఛైర్మన్ తిరుపతి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

■ ధ్రువపత్రాలు సకాలంలో జారీ చేయాలి

కాల్వశ్రీరాంపూర్: మీసేవా కేంద్రాల ద్వారా వచ్చిన వివిధ దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి ధ్రువపత్రాలను సకాలంలో జారీ చేయాలని ఆర్డీవో గంగయ్య పేర్కొన్నారు. శుక్రవారం ఆయన కాల్వశ్రీరాంపూర్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. తహసీల్దార్ ఎండి.వకీల్, నాయబ్ తహసీల్దార్ శంకర్, ఆర్ఐలు రాజేందర్, ఎండి.అజీమ్, సిబ్బంది పాల్గొన్నారు.

■ ప్రభుత్వ భూముల సర్వే

ధర్మారం: ఖిలావనపర్తి శివారులో రెండు రోజులుగా జరుగుతున్న ప్రభుత్వ భూముల సర్వేను శుక్రవారం తహసీల్దారు అరీఫుద్దీన్ పర్యవేక్షించారు. కలెక్టర్ ఆదేశాలతో ఖిలావనపర్తి, నర్సింగాపూర్, ధర్మారం గ్రామాల్లో ప్రభుత్వ భూముల సర్వేను గురువారం అధికారులు ప్రారంభించారు. అన్ని గ్రామాల్లోని ప్రభుత్వ భూములనూ సర్వే చేస్తామని తహసీల్దారు తెలిపారు. ఆర్ఐ స్వరూప, సర్వేయరు శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

■ తాగునీటి సరఫరాపై శిక్షణ తరగతులు

ఎలిగేడు(సుల్తానాబాద్): ఎలిగేడు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎలిగేడు, జూలపల్లి మండలాల పరిధిలో తాగునీటి సరఫరా సహాయకులకు మిషన్‌భగీరథ, తాగునీరు సరఫరా వ్యవస్థపై శిక్షణ తరగతులు నిర్వహించారు. చేతిపంపుల మరమ్మతులు, విద్యుత్తు, ప్లంబింగ్, నాణ్యమైన తాగునీరు తదితర అంశాలపై ఎంపీడీవో భాస్కర్‌రావు అవగాహన కల్పించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివప్రసాద్, ఎంపీవో అనిల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

■ కార్మికులకు వైద్య పరీక్షలు

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్‌లో శుక్రవారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ఎంపీడీవో రామ్మోహనచారి పాల్గొన్నారు. కార్మికులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం డ్రై డేలో భాగంగా గ్రామంలో పేరుకుపోయిన చెత్తను తొలగించి వీధులు శుభ్రం చేశారు. ఎంపీవో గోవర్ధన్, కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, ఏఎన్ఎం సరోజన, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ ఉపాధ్యాయినులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

■ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

పాలకుర్తి (రామగుండం): రామగుండం మహిళా గురుకుల పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సత్కరించారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ మంజుల, ఉపాధ్యాయులు స్వప్న, వాణి, ప్రమీల, రామకృష్ణలను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. వివిధ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిన విద్యార్థులు శ్వేతరాయ్, వినూత్న, తేజస్ఫూర్తి, శ్రీసత్య, తన్మయి, వైష్ణవి, అక్షయ నగదు ప్రోత్సాహకాలు అందించారు. పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ సతీష్, కార్పొరేటర్లు సతీష్‌కుమార్, సలీం బేగ్, రామగుండం గురుకుల కళాశాల ఇన్‌ఛార్జి మాధవి, ఉప ఛైర్మన్ క్రాంతి కుమార్, ప్రధాన కార్యదర్శి డి.మురళీధర్, సెక్రటరీ సతీష్, ట్రెజరర్ రాజేశ్వర్‌రావు, జాయింట్ సెక్రటరీ స్వామి పాల్గొన్నారు.

■ ఇప్పలపల్లిలో వైద్య శిబిరం

ముత్తారం: ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఇన్‌ఛార్జి, ఎంఎల్‌హెచ్‌పీ బియ్యాని లావణ్య ఆధ్వర్యంలో శుక్రవారం ముత్తారం మండలం ఇప్పలపల్లిలో వైద్య శిబిరం నిర్వహించారు. జ్వర బాధితుల నుంచి రక్త నమూనాలు సేకరించారు. రక్తపోటు, మధుమేహం వ్యాధిగ్రస్థులకు మందులు అందజేశారు. అనంతరం గ్రామంలో పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ డి.ప్రమీల, సూపర్‌వైజర్ రమాదేవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.